క్లుప్తంగా

అన్నప్రసాదం వితరణ


అన్నప్రసాద వితరణ చేస్తున్న శ్రీనివాసరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: అరసవల్లిలో శుక్రవారం జరిగిన సూర్యజయంతి వేడుకుల సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థలు భక్తుల సేవలో తరించాయి. ఇందులో భాగంగా ఎస్‌ఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత సూర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేసి ఔదర్యాన్ని చాటుకున్నారు.

రాజశ్యామలగా లలితాదేవి


పూజలందుకున్న లలితాదేవి

శ్రీకాకుళం కల్చరల్: మొండేటివీధిలోని లలితా సహిత శివకామేశ్వరస్వామి వారి సన్నిధిలో లలితాదేవిని రాజశ్యామల మాతగా శనివారం అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. షిర్డీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులు ప్రసాద వితరణ చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రామారావు

రణస్థలం: మండలంలోని సంచాం, వెల్లురాయి, తిరుపతిపాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎల్.రామారావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, వృద్ధులు, దివ్యాంగుల కోసం ర్యాంప్, మరుగుదొడ్ల సదుపాయాలపై ఆరా తీశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సరిపడే సదుపాయాలు, అందుకు తగిన టెంట్లు, కుర్చీలు సమకూర్చాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో బందోబస్తు భారీగా పెట్టాలని సెక్టార్ అధికారులకు సూచించారు. బీఎల్‌ఓలు, సెక్టార్ అధికారులు ఉన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి పలువురి సంతాపం


సత్యంనాయుడు (ఫైల్)

జి.సిగడాం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మధుపాం మాజీ సర్పంచ్ ముగ్గు సత్యంనాయుడు శనివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సత్యంనాయుడు పార్టీ బలోపేతానికి ఎంతో సేవ చేశారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఈయన మృతి పట్ల పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంతాపం తెలిపారు.

అలసత్వం వహిస్తే చర్యలు


సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

జి.సిగడాం: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామ స్థాయిలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అలత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ కుచ్చెర్లపాటి కృష్ణంరాజు హెచ్చరించారు. మండలంలోని పాలఖండ్యాం సచివాలయాన్ని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామం నుంచి మండల స్థాయి వరకు వివిధ శాఖల్లో పని చేస్తున్న సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. బూత్ లెవల్ అధికారులంతా అంకిత భావంతో పని చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ధారబోయిన ధర్మారాజ్, పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

19న హర్షవల్లి–చరిత్ర సంస్కృతి పుస్తకావిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావు రచించిన 'హర్షవల్లి–చరిత్ర, సంస్కృతి పుస్తకాన్ని ఈనెల 19న మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆవిష్కరిస్తారని అరసవల్లి ధర్మకర్తల మండలి సభ్యుడు మండవిల్లి రవి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో జరగనున్న కార్యక్రమంలో పలువురు రచయితలు పాల్గొంటారన్నారు.


●కామాక్షికి పుష్పాలంకరణ



పట్టణంలోని పాండ్రంగి వీధిలో ఉన్న కామాక్షి పీఠంలో రాజశ్యామల నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని శనివారం పుష్పాలతో అలంకరించారు. పీఠం నిర్వాహకులు వేదుల వెంకట సూర్యనారాయణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, పుష్పార్చనలు

శ్రీకాకుళం కల్చరల్

● వేంకటేశ్వరస్వామికి పూజలు

స్థానిక చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా స్వామివారిని రకరకాల పూలతో, తులసీదళాలతో అలంకరణ చేశారు. అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈవో మాధవి భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. మొండేటివీధిలోని వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణ జరిగాయి. సుప్రభాతసేవ, అష్టోత్తరశతనామాలచే భక్తుల గోత్రనామాలతో అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ పూజలు జరిపారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి.

శ్రీకాకుళం కల్చరల్

నేటినుంచి జయమ్మ స్మారక దినాలు


జయమ్మ స్మారక దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

రణస్థలం: విప్లవ ధీర వనిత జయమ్మకు నివాళిగా ఈ నెల 18 నుంచి వారం రోజులపాటు స్మారక దినాలను పాటించాలని సీపీఐ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ పిలుపునిచ్చారు. మండలంలోని పైడిభీమవరంలో జయమ్మ స్మారక దినోత్సవ కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విప్లవ స్ఫూర్తితో భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక నూతన ప్రజా స్వామిక విప్లవ కర్తవ్యాలను ముందుకు తీసుకుపోతామన్నారు. ఈ నెల 22న శ్రీకాకుళం ఎన్జీవో హోమ్‌లో ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయిలో నిర్వహించనున్న కామ్రేడ్ జయమ్మ స్మారక సభను విజయవంతం చేయాలని కోరారు. 2020 ఫిబ్రవరి 24న ఆమె మృతి చెందారన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. కరపత్రాల ఆవిష్కరణలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి

● మున్సిపల్ కమిషనర్ తమీమ్ అన్సారియా


నిర్మాణాలపై కొలతలు వేయిస్తున్న కమిషనర్ తమీమ్ అన్సారియా

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని పార్కులను అభివృద్ధి చేస్తామని శ్రీకాకుళం నగర పాలకసంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా అన్నారు. శాంతినగర్ కాలనీలోని నాగావళి రివర్‌వ్యూ పార్కు, కృష్ణా పార్కులను శనివారం సందర్శించారు. అలాగే పలు నిర్మాణాలు, స్ట్రీట్‌ఫుడ్ ప్రాంతాలను పరిశీలించారు. అనుమానం ఉన్న నిర్మాణాలపై కొలతలు వేయించారు. అయితే ఎటువంటి లోపాలు లేకపోవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిసారించి నగర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రతిఒక్కరు ప్లాన్‌లు తీసుకుని ధైర్యంగా నిర్మాణాలు చేసుకోవచ్చాన్నారు. కమిషనర్ వెంట టీపీఎస్ ఉమామహేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

● ఎంపీపీ మొదలవలస చిరంజీవి


మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతోనే మండలం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో చేపట్టిన పనులకు బిల్లలు మంజూరు చేయాలని పలువురు సభ్యులు కోరారు. ఉపాధి ఏపీఓ శోభాదేవి మాట్లాడుతూ.. రూ.1.08 కోట్ల బకాయిలు ఉన్నాయని, త్వరలోనే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి కోసం గ్రామాల్లో చేపట్టిన నిర్మాణాలకు బిల్లులు మంజూరు కాలేదని ఎస్ఎంపురం సర్పంచ్ కోన సూర్యారావు సభ దృష్టికి తెచ్చారు. కమ్యూనిటీ కాంట్రాక్టు సంస్థ ద్వారా చేపట్టిన పనులను పరిశీలించి బిల్లులు చెల్లించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి జేఈ భాగ్యలక్ష్మి తెలిపారు. కింతలిమిల్లు, చినరావుపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకులను నియమించలేదని, స్థానికంగా లేని రిజర్వేషన్ (రోస్టర్) వల్ల నియామకం సాధ్యం కావటం లేదని కేశవరావుపేట సర్పంచ్ పైడి భాస్కరరావు సభ దృష్టికి తెచ్చారు. భవిష్యత్‌లో నిబంధనల మేరకు రోస్టర్ విధానాన్ని మార్చి నియామకం చేపడతామని మహిళా శిశు సంక్షేమశాఖ పీఓ పాపినాయుడు తెలిపారు. ఏఓ సురేష్ మాట్లాడుతూ రబీ పంటకు సంబంధించి ఈ నెల 19 తేదీలోగా ఈ–క్రాప్ పూర్తిచేసుకోవాలన్నారు. వైద్యాధికారి ఎం.ఉషశ్రీ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ –2 స్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉన్నత వైద్య పరీక్షలు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీకి రిఫర్ చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు సకాలంలో పూర్తిచేస్తామని తహసీల్దార్ వి.శ్యాంకుమార్ అన్నారు. ఎంపీడీఓ రామ్మోహన్, సీనియర్ సహాయకులు కిల్లారి నారాయణరావు పాల్గొన్నారు.

పీఎం సౌర గృహ పథకంపై అవగాహన


విద్యుత్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏఈ రవికుమార్

ఆమదాలవలస రూరల్: సోలార్ విద్యుత్‌తో గృహ వినియోగదారులు విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చునని ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్ తెలిపారు. పట్టణంలోని రూరల్ సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ సిబ్బందికి ప్రధానమంత్రి సౌర గృహ పథకంపై శనివారం అవగాహన కల్పించారు. సోలార్ రూఫ్ టాప్ విద్యుత్ పొందడానికి సచివాలయంలో గృహ వినియోగదారులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకంపై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యుత్‌శాఖ సిబ్బందిపై ఉందన్నారు. విద్యుత్ వినియోగంలో ఆదాతో పాటు తక్కువ ఖర్చుతో విద్యుత్‌ను సోలార్ ద్వారా పొందవచ్చన్నారు. ఈ పథకం పొందే లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.60 వేల సబ్సిడీ అందించడంతో పాటు మిగిలిన ఖర్చుకు బ్యాంకు ద్వారా రుణం మంజూరు చేస్తుందన్నారు. ఈ పథకం కోసం విద్యుత్ సిబ్బందికి ఆధార్, బ్యాంక్ ఖాతా నంబర్ తెలియజేయాలన్నారు. గ్రామాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు, లైన్‌మన్‌లు ఈ పథకం గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. తక్కువ ఖర్చుతో విద్యుత్ పొందే మార్గాలను ప్రభుత్వం ప్రజలకు అందజేస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో లైన్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, లైన్‌మన్‌లు రామస్వామి, టి.కృష్ణారావు, జి.గోవింద పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్ అందుకుంటున్న జగన్నాథ్ పూరి

మెళియాపుట్టి: మండల కేంద్రానికి చెందిన ఎడ్లపల్లి జగన్నాథ్ పూరి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్ విభాగంలో స్టాటికల్ ఇన్వెస్టిగేటర్‌గా పనిచేస్తున్నారు. ఎనలైటనింగ్ ఆన్ రిలయబుల్ ఎస్టిమేట్, సస్టైనబుల్ గ్రోత్ ఆఫ్ వైటల్ స్టాటిస్టిక్స్ సిస్టం ఇన్ ఇండియా (ముఖ్యమైన అంచనాలు, గణాంకాల వ్యవస్థ యొక్క స్థిరమైన వృద్ధిపై అవగాహన కల్పించడం) అనే అంశంపై రీసెర్చ్ చేసినట్లు జగన్నాథ్ పూరి శనివారం తెలిపారు. జగన్నాథ్ పూరికి తల్లిదండ్రులు కృష్ణారావు, దమయంతి, స్నేహితులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

బీఎల్‌ఓల పాత్ర కీలకం


మాట్లాడుతున్న ఈఆర్‌ఓ రామ్మోహనరావు

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ బూత్ స్థాయి ఆఫీసర్లు(బీఎల్‌ఓ) పాత్ర చాలా కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని నరసన్నపేట ఈఆర్‌ఓ రామ్మోహనరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నాలుగు మండలాల బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే ఓటరు జాబితాలను పోలింగ్ కేంద్రాల్లో సిద్ధం చేశామని, వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా ఓటు నమోదు కోసం, పేరు మార్పు, పోలింగ్ కేంద్రం మార్పు వంటి దరఖాస్తులు వస్తే వెంటనే పరిశీలించి, మీ లాగిన్ నుంచి తహసీల్దార్‌కు పంపాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు పరిశీలించి, ఏమాత్రం అనుమానం ఉన్నా తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. విద్యుత్, ఫర్నీచర్, మరుగుదొడ్లు, ర్యాంప్ కచ్చితంగా ఉండాలన్నారు. తహసీల్దార్ కనకారావు, డీటీ శరత్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రపతి మృతికి సంతాపం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీసీ సంక్షేమం సంఘం జిల్లా అధ్యక్షులుగా, బహుజన సంఘాల నేతగా పిట్ట చంద్రపతిరావు చాలాకాలం పని చేసి వెనుకబడిన వర్గాల కోసం పాటుపడ్డారని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి అన్నారు. ఆయన మృతి విచారకరమన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అతని పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. బీసీల కోసం అనేక ఉద్యమాల్లో పాల్గొని అందరి మన్ననలు పొందిన వ్యక్తి అని కొనియాడారు.

శ్రీకాకుళం పాతబస్టాండ్: చంద్రపతిరావు ఆకస్మిక మృతి బీసీ ఉద్యమానికి తీరనిలోటని ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, శ్రీకాకుళం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, న్యాయవాది వాన కృష్ణచంద్ అన్నారు. చంద్రపతి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బీసీల అభ్యున్నతికి చంద్రపతి కృషి చేశారని.. ఆయన పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామన్నారు. పరామర్శలో బీన ఢిల్లీరావు, పల్లి నాగేశ్వరరావు, బధ్రి సీతమ్మ, ఇ.శ్రీను, టి.గిరి, జి.ఢిల్లీరావు, సంఘం సభ్యులు బీవీ రమణ, పి.జోగారావు ఉన్నారు.

20 నుంచి పోలాకి జాతర

పోలాకి: ఈ నెల 20వ తేదీ నుంచి పోలాకి కనకదుర్గాభవాని అమ్మవారి 22వ జాతర మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్తల కమిటీ సభ్యులు టంకాల శ్రీరాములు, పల్లి రాజు శనివారం తెలిపారు. ఐదురోజులపాటు నిర్వహించే జాతర కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. తొలిరోజు అమ్మవారి రథయాత్రతోపాటు ఐదురోజుల పాటు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగా శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

సరుబుజ్జిలి: యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, యోగా ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు తెలిపారు. ఎన్ఎస్ఎస్ పీఓ, యోగా శిక్షకులు రమేష్‌సాహు ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు యోగాభ్యాసాలపై శనివారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ధ్యానశక్తితో నూతన ఉత్సాహం కలుగుతుందన్నారు. అధ్యాపకులు నాగేంద్రరామకృష్ణ, ఆకెల్ల రామారావు, శ్రీనివాసరావు, వినోద్‌రాజు పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశి యాత్ర ప్రారంభం రేపు


ముస్తాబైన శివాలయం

కొత్తూరు: మండలంలోని పారాపురం గ్రామంలో పురాతనమైన స్వయంభూ శివాలయంలో ఈ నెల 19 నుంచి 23 తేదీ వరకు భీష్మ ఏకాదశి యాత్ర మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఐదు రోజులపాటు ఆలయంలో శివునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఆధ్యాత్మిక, పౌరాణిక, జానపద నాటక ప్రదర్శలు ఉంటాయన్నారు. యాత్ర సందర్భంగా శివాలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. యాత్ర మహోత్సవానికి ప్రతిఒక్కరూ హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

20న వలంటీర్లకు సత్కారం

పాతపట్నం: మండలంలోని 18 గ్రామ సచివాలయ పరిధిలో పనిచేస్తున్న 421 మంది గ్రామ వలంటీర్లకు సేవా పుస్కారాలను ప్రభుత్వం అందజేస్తుందని ఎంపీడీఓ కె.వెంకన్నబాబు శనివారం తెలిపారు. ఈ నెల 20న ఎమ్మెల్యే రెడ్డి శాంతి చేతుల మీదుగా వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తామన్నారు. మండలంలోని బద్దుమర్రి, కాగువాడ, పెద్దలోగిడి, రొంపివలస, సీది గ్రామ సచివాలయాలకు చెందిన ఒక్కో వలంటీర్ సేవా రత్నా పురస్కారానికి ఎంపికయ్యారన్నారు.

21న కొత్తూరులో..

కొత్తూరు: మండలంలోని 27 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామ వలంటీర్లు అందిస్తున్న సేవలను పురస్కరించుకుని ఈ నెల 21న సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమరావు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 11 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా రామమందిర ప్రతిష్ఠా మహోత్సవం


పూజల్లో పాల్గొన్న దంపతులు


ప్రతిష్ఠా విగ్రహాలకు జలాధివాసం జరుగుతున్న దృశ్యం

గార: జొన్నలపాడు కాలనీలోని రామమందిర ప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం ఉదయం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ దార్లపూడి కామేశ్వరశర్మ, ఆరవెల్లి బాలభాస్కరశర్మల ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజతో మహోత్సవాన్ని అర్చకులు ఆరంభించారు. ఈ సందర్భంగా మండప ఆరాధనలు, నీరాజన మంటపాలు జరిగాయి. అధిక సంఖ్యలో దంపతులచే దీక్షాధారణ, కంకణధారణ నిర్వహించారు. ప్రతిష్ఠా విగ్రహాలకు జలాధివాసం, క్షీరాధివాసం జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్


విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈవో కృష్ణారావు

శ్రీకాకుళం రూరల్: సింగుపురం గ్రామంలోని శారద విద్యానికేతన్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను శనివారం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యానికేతన్ కరస్పాండెంట్ ముద్దాడ రామ్మోహన్‌రావు, ప్రిన్సిపాల్ ఎం.కృష్ణచైతన్య పర్యవేక్షణలో వంద మందికిపైగా విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీకాకుళం ఎంఈవో జి.కృష్ణారావు విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. చిట్టిచేతులు అద్భుతాలు సృష్టించాయన్నారు. ప్రాజెక్టులన్నీ మెదడుకు పదును పెట్టే విధంగా ఉన్నాయని కొనియాడారు.

జేఈఈ ర్యాంకర్లకు మంత్రి ధర్మాన అభినందన


మంత్రి ధర్మానను కలిసిన చక్రధర్, ర్యాంకర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: జేఈఈలో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులు జిల్లాకు గర్వకారణంగా నిలిచారని రెవెన్యూశాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు కొనియాడారు. ఇటీవల వెలువడిన జేఈఈ మెయిన్స్ ఫేజ్–1 ఫలితాల్లో అత్యుత్తమ పెర్సంటైల్..ఎన్ఐటీ ర్యాంకులు సాధించిన చక్రధర్ కళాశాలకు చెందిన 17 మంది విద్యార్థులను శనివారం తన క్యాంపు కార్యాలయంలో మంత్రి అభినందించారు. చదువుల్లో మేటిగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన విద్యార్థులు నిలుస్తుండటం అభిందనీయమన్నారు. మంచి ర్యాంకులు సాధించేలా ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్న చక్రధర్ కళాశాల ప్రతినిధులను మెచ్చుకున్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ యాళ్ల చక్రధర్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

● టెక్కలి డీఎస్పీ బాలచంద్రా రెడ్డి


గ్రామపెద్దలతో మాట్లాడుతున్న డీఎస్పీ బాలచంద్రా రెడ్డి

జలుమూరు: ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు తిలారు జంక్షన్‌లో జరగనున్న లక్ష్మీనరసింహస్వామి 26వ వార్షికోత్సవాల జరనున్నాయి. జలుమూరు పోలీస్ స్టేషన్‌లో చిన్నదూగాం గ్రామ పెద్దలతో టెక్కలి డీఎస్పీ కె.బాలచంద్రారెడ్డి శనివారం మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలన్నారు. స్వామివారి ఉత్సవాల నిర్వహణకు గ్రామ పెద్దలు సహకరించాలన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, కల్యాణం, దర్శనాలు తదితర కార్యక్రమాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవదాయశాఖతో కలిసి సజావుగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు సమ్మతించారు. నరసన్నపేట సీఐ బూర ప్రసాదరావు, ఎస్ఐ మధుసూదనరావు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి


మాట్లాడుతున్న టెక్కలి డీఎల్‌పీఓ రమణ


పెద్దలోగిడిలో డ్రాఫ్ట్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

పాతపట్నం: గ్రామ పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగు తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఉపయోగించాలని టెక్కలి డీఎల్‌పీఓ ఐ.వి.రమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పంచాయతీ కార్యదర్శులతో 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు, ప్రణాళికలపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల డ్రాఫ్ట్ ప్లాన్‌ను ఎలా తయారు చేయాలి, ఆర్థిక సంఘం నిధులు వినియోగం ఎలా చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పెద్దలోగిడి గ్రామ పంచాయతీని సందర్శించారు. రికార్డులు, పంచాయతీ ప్రణాళిక డ్రాఫ్ట్ ప్లాన్‌ను పరిశీలించారు.